Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 224 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 15 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# అందరికీ ఆహార భద్రత

**- అందుబాటులోకి 62 గ్రామీణ అన్న క్యాంటీన్లు - 269కి పెరగనున్న క్యాంటీన్ల సంఖ్య**
**- ఇప్పటికే 207 క్యాంటీన్ల ద్వారా ప్రతీ రోజు 2.10 లక్షల మందికి భోజనం**
**- నేడు ధరణికోటలో అన్నక్యాంటీన్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**





**అమరావతి, (రాజధాని వార్తలు):** కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం... తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.5లకే పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్... ఆ హామీని ఆచరణలో పెడుతోంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రెండవ విడత అన్నక్యాంటీన్లను ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో ప్రారంభిస్తారు.

**రూ.5లతో రుచిగా... శుచిగా ఆహారం**

గత ప్రభుత్వం కక్షగట్టి మూసివేసిన అన్నక్యాంటీన్లను కూటమి అధికారంలోకి వచ్చాక పున: ప్రారంభించింది. ఈనెల 15వ తేదీన ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269 కు పెరుగనుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013 మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా... సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సీడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటి గంటకు ధరణికోటకు చేరుకుంటారు.

1.30 గంటలకు అన్నాక్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగిం చుకుని 02.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

# క్వాంటం టెక్నాలజీలో ఏపీ చారిత్రాత్మక అడుగు : సీఎం చంద్రబాబు










**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిలో దేశంలోని తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించిన అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మొట్టమొదటి క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని ప్రారంభించటం సంతోషంగా ఉంది. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలీటీ, మేథాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. క్వాంటం సైన్స్ వంద ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున దీన్ని సాకారం చేసుకుని చరిత్ర సృష్టించాం. విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతిని పురస్కరించుకుని అమరావతిలో క్వాంటం చరిత్ర ప్రారంభించుకున్నాం. క్వాంటం టెక్నాలజీని పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు యాక్సెస్ కల్పించటం అందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను. భారత తొలి ఓపెన్-యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీల ఏర్పాటులో అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోన్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఏక్యూవీని వేగంగా పూర్తి చేయటంలో సహకరిస్తోన్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. అమరావతిలో ప్రారంభమైన 1ఎస్, 1క్యూ క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టిఫై చేయడానికి కీలకంగా మారతాయి. దేశంలోని తొలి క్వాంటం కంప్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక అయినందుకు గర్విస్తున్నాను. ఐటీ రంగంలో కీలక పాత్ర పోషించిన తెలుగు గడ్డపై క్వాంటం టెక్నాలజీలకు వేదికగా మారటం గర్వకారణం.

పారిశ్రామిక రంగానికి విద్యుత్, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్, ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నా లజీ కీలకం. క్వాంటం సాంకేతికతలో సాధికారిత సాధించిన దేశాలే భవిష్యత్తును శాసించే అవకాశం ఉంటుంది. భారతీయ పరిశోధకులకు క్వాంటం హార్డ్‌వేర్ పరీక్షించేందుకు ఏక్యూఆర్ఎఫ్ (అమరావతి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ) కీలకంగా మారుతుంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని అమరావతి 1ఎస్ పరిశోధనలకు, మేధా టవర్స్‌లోని అమరావతి 1క్యూ పారిశ్రామిక వినియోగానికి తోడ్పడతాయి. ఈ రెండూ క్వాంటం టెక్నాలజీలో దేశ సామర్థ్యాన్ని పెంచాయని భావిస్తున్నాను. కేవలం 8 నెలల్లోనే క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చాయి.

# చంద్రబాబు విజన్‌తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు

**- రూ. 2.75 కోట్లతో ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, లైబ్రరీల ఆధునీకరణ - రాష్ట్రంలో 36 కేంద్రాలకు 216 కంప్యూటర్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన - మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి - శిక్షణ కేంద్రాల్లో కొత్త కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు**
**- ఏఐ, సైబర్ నెట్ వర్క్, క్లౌడ్ కంప్యూటింగ్ లాంటి డిమాండ్ కోర్సులకు శిక్షణ**



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాల్లో రూ. 2.75 కోట్లు వ్యయంతో ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో కొత్త కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్ వేర్ తో పాటు, లైబ్రరీల ఆధునికరణ చేపడుతున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన రూ. 2.75 కోట్లు మొత్తం ప్రభుత్వం మంజూరు చేసి ఉర్దూ అకాడమీకి జమ చేయడం కూడా జరిగిందని మంగళవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని 36 కేంద్రాలలో 216 కొత్త కంప్యూటర్లు, కొత్త యూపీఎస్ లు, లేజర్ జెట్ ప్రింటర్లు, స్కానర్‌లతోపాటు ఆధునిక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు, లైబ్రరీల ఆధునీకరణ చేపడుతున్నట్లు అయన తెలిపారు. ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి యువతకు కొత్త కోర్సులు నేర్పించబోతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ నెట్ వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, జావా, పైతాన్, గ్రాఫిక్ డిజైనింగ్‌లాంటి, దేశ విదేశాల్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షకులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

**చంద్రబాబు విజన్ తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తున్నదని మైనారిటీ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమం, ఉర్దూ భాషాభివృద్ధికి సీఎం చంద్రబాబు పక్షపాతిగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. చంద్రబాబు సారధ్యంలోనే ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, లైబ్రరీల ఆధునీకరణ యువత భవిష్యత్తును అత్యున్నత స్థాయిలో మార్చబోతున్నదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం నవ్యాంధ్రలో 36 కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, (65 మంది బోధన సిబ్బంది, 25 మంది ఇతర సిబ్బందితో) మరియు 36 ఉర్దూ లైబ్రరీలను కాపాడుకుంటూ రావడం జరిగిందన్నారు. 2014-2019 లో ఉర్దూ అకాడమీకి ఏకంగా రూ. 160.62 కోట్లు నిధులను సీఎం చంద్రబాబు విడుదల చేశారని, ఈ నిధులతో శిక్షణ కేంద్రాలు అత్యాధునిక ల్యాబ్‌లుగా మారి వేలాది మంది నిరుద్యోగ యువతకు సాఫ్ట్ వేర్ రంగంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణను అందిపుచ్చుకున్న యువత ఎంతోమంది దేశ విదేశాల్లోని ప్రముఖ అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తూ ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు వేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2019-2024లో ఉర్దూ శిక్షణ కేంద్రాలను, లైబ్రరీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఫరూక్ విమర్శించారు. బడ్జెట్ విడుదల చేయకపోవడంతో గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో శిక్షణ కార్యక్రమాలు నిలిచిపోయి, మౌలిక సదుపాయాలు దెబ్బతిని, మైనారిటీ యువత కలలు కనుమరుగయ్యే దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధిక బడ్జెట్ కేటాయిస్తూ రావడం జరుగుతున్నదని మంత్రి వెల్లడించారు. ఉర్దూ శిక్షణ కేంద్రాలను పటిష్టం చేయడం, లైబ్రరీలను ఆధునికరించడం కోసం ప్రతి కేంద్రానికి 5 నుండి 6 కొత్త కంప్యూటర్లు, ప్రింటర్లు ఇతర మౌళిక సదుపాయాలు, ఆధునిక సాఫ్ట్ వేర్‌ను ఏర్పాటుచేసి సరికొత్త హంగులతో పునః ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీల జీవితాల్లో వెలుగులు నింపే, యువతకు ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగించే విధంగా శిక్షణ కోసం, లైబ్రరీల ఆధునీకరణకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను, ఉర్దూ లైబ్రరీలను సక్రమంగా, సమర్ధవంతంగా నిర్వహించాల్సిందిగా ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, డైరెక్టర్ గౌస్ పీర్‌లకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సూచించారు.

# కసి, పట్టుదలతో ఎవరెస్ట్ శిఖరాలను అధిరోహించండి : మంత్రి లోకేశ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు, వారిలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు.

**దేశ చరిత్రలోనే మొదటిసారి..**

విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల బృందం ఎవరెస్ట్ అధిరోహణకు వెళ్లడం దేశ చరిత్రలోనే ఇది మొదటిసారని నారా లోకేశ్ తెలిపారు. సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏటా ఇలాంటి ప్రతిభావంతులను గుర్తించి, వారిని అన్నివిధాలా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సమగ్ర శిక్షా విభాగం ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, ఈ సాహస యాత్రకు సిద్ధం చేశామని తెలిపారు.

**పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చు: మంత్రి లోకేశ్**

మంత్రి నారా లోకేశ్ ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ వారిలో స్ఫూర్తిని నింపారు. శారీరక వైకల్యం అనేది ఓ సవాలు మాత్రమేనని, మనసులో కసి, పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ చేరుకోవడం ద్వారా ఈ విద్యార్థులు ప్రపంచానికి కొత్త సందేశాన్ని ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**నిరంతర తోడ్పాటు..**

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను కేవలం ఒకసారి గుర్తించి వదిలేయడం కాకుండా, వారిని నిరంతరం ప్రోత్సహించే వ్యవస్థను నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం విద్యా శాఖ మరిన్ని సాహసోపేతమైన కార్యక్రమాలను రూపొందిస్తుందని తెలిపారు. ఈ బృందం నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహించడానికి బయలుదేరడం ఏపీకే గర్వకారణమని, వీరు తిరిగి వచ్చే వరకు ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని వెల్లడించారు.

**సమగ్రశిక్ష - వినూత్న ముందడుగు**


సాధారణంగా ఇలాంటి సాహస యాత్రలు క్రీడాకారులు లేదా అనుభవం ఉన్నవారు చేస్తారని కానీ, సమగ్రశిక్ష విభాగం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేయడం విశేషమని తెలిపారు. ఇది విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంచుతుందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం నిరూపిస్తోందని తెలిపారు. ఎవరెస్ట్ యాత్రకు వెళ్తున్న విద్యార్థుల బృందానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# నెల్లూరు ప్రియదర్శిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని పప్పుల వీధి, ప్రకాష్ నగర్‌లోని తవ్వా రంగయ్య కళ్యాణ మండపంలో నెల్లూరు ప్రియదర్శిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్, మెడికవర్ హాస్పిటల్ మరియు రవి మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు దంత సంబంధిత పరీక్షలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్యుల సూచనలు, సలహాలు పొందారు. ఈ కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే కాకుండా, హాస్పిటల్‌కు రాలేని వారికి కూడా క్యాంపుల ద్వారా సేవలు అందించడం మా క్లబ్ లక్ష్యంగా పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే నెల్లూరు పరిసర ప్రాంతాలైన దగదర్తి, కోట, దామరమడుగు, ముదివర్తి వంటి గ్రామాల్లో కూడా ఇలాంటి అనేక శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించామని తెలిపారు. ప్రియదర్శిని లయన్స్ క్లబ్ నిర్వహించిన ఉచిత కంటి శిబిరాల ద్వారా కాటరాక్ట్ ఉన్న రోగులను గుర్తించి, వారిని వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించారు. ఈ విధంగా దాదాపు 50 మందికి పైగా కంటి ఆపరేషన్లు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ MJF Ln. ఆదర్శ కృష్ణమూర్తి మరియు జోన్ చైర్మన్ Ln. సాదు యశ్వంత్ పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి వేదికను అందించిన తవ్వా





రంగయ్య కళ్యాణ మండపం యజమాని తవ్వా బలరాకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ నిఖిత. ఎగ్జిక్యూటివ్ సాయినాథ్, లోకేష్, రవి డెంటల్ హాస్పిటల్ డాక్టర్ ప్రసన్న కుమార్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ రవికుమార్, VR టెక్నీషియన్స్ ఈశ్వర్, రమేష్, మార్కెటింగ్ మేనేజర్ కృష్ణ నరేష్ పాల్గొన్నారు. అలాగే నెల్లూరు ప్రియదర్శిని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ Ln. శ్రీ కల్పన, సెక్రటరీ Ln. డా. ప్రతిభ భారతి, ట్రెజరర్ Ln. శ్రీ వాణి తదితరులు పాల్గొన్నారు.

# 2025లో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

## - మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 2025లో బదిలీ అయ్యి, వివిధ కారణాలతో ఇంకా రిలీవ్ కాని ఉపాధ్యాయులను ఈనెల ఏప్రిల్ 22న రిలీవ్ చేయాలని మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ వారు కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మస్తాన్ చేమూరు మాట్లాడుతూ రాష్టఉపాధ్యాయుల పలు సమస్యలను మీడియా ద్వారా ప్రభుత్వం నకు విన్నవించుకోవడం జరిగింది. ఐ.ఈ.ఆర్.టి ఉపాధ్యాయులను కోర్టు ఆదేశాల మేరకు రెగ్యులర్ చేయాలని, మినిమమ్ టైమ్ స్కేల్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ మరియు కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి వరకు ఉన్న తరగతులను విడగొట్టి, 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పరిధిలోనే ఉంచాలని, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో MTA రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు తిరుపతి జిల్లా ఇంచార్జ్ గొర్రిపాటి పీరయ్య, రాష్ట్ర అధికారప్రతినిధి గిద్దలూరు ప్రసాద్, రాష్ట్ర మహిళ కార్యదర్శి కాకుమాని జ్యోతి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పందల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**బకాయిలు చెల్లించినందుకు ప్రభుత్వానికి అభినందనలు:**

గత ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిలను తీరుస్తూ, మరో సారి రూ. 7,059 కోట్లు విడుదల చేసి, పదవీ విరమణ చేసిన వారికి లక్షలాది రూపాయలు జమ చేసినందుకు.. అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న వారికి పిఎఫ్, జీవిత భీమా, ఇతర బకాయిలు దాదాపు పూర్తి చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మహాజన టీచర్స్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పెద్ద మనుసు చేసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డి.ఏ మరియు ఐ.ఆర్ వెంటనే ప్రకటించేలా చర్యలు తీసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయుల మనుసులో ఆనందం నింపుతారని కోరారు.

ఈ కార్యక్రమంలో మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మస్తాన్ చేమూరుతో పాటు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు తిరుపతి జిల్లా ఇంచార్జ్ గొర్రిపాటి పీరయ్య, రాష్ట్ర అధికారప్రతినిది గిద్దలూరు ప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కాకుమాని జ్యోతి నెల్లూరుజిల్లా ప్రధానకార్యదర్శి పందల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిఆర్ఓ విజయ్ కుమార్, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ హరిశ్చంద్రారెడ్డి తెలుగు గంగ స్పెషల్ అధికారి వంశీ కృష్ణ, డి.పీ.ఓ వసుమతి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు మరియు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ఎంప్లాయిస్ కి-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ అప్‌లోడ్ విషయములో కొన్ని శాఖలు ఇంకా మొదలు పెట్టలేదని, మరి కొన్ని శాఖలు వెనకంజలో ఉన్నాయన్నారు. శాఖల వారీగా సమీక్షించి కి-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 15వ తేది నుండి మండలాల వారీగా సంబందిత అధికారులతో కలసి ఉదయం 6 గంటల నుండి ఆయా మండలాలో పర్యటించి క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టనున్నామని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో సమాచార హక్కుచట్టం అమలులో భాగంగా ఆయా అధికారులు విధిగా ఆన్‌లైన్‌లో నమోదు కావాలని ఆయన సూచించారు. ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీల స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతోపాటు షామియానాలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.


# అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా గళమెత్తిన తుమ్మలతలపూరు గ్రామస్తులు – కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సైదాపురం మండలంలోని తుమ్మలతలపూరు గ్రామంలో ప్రతిపాదిత మైనింగ్ కార్యకలాపాలపై గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గ్రామ చెరువుకు సంబంధించిన సర్వే నంబర్ 101లో ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో మైనింగ్ చేపట్టేందుకు మైనింగ్ మాఫియా సిద్ధమవుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల వాదన ప్రకారం, ఈ మైనింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణలో మెజార్టీ ప్రజలు వ్యతిరేకంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ, ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా అనుమతులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. మైనింగ్ వల్ల గ్రామ చెరువు నాశనం అవుతుందని, భూగర్భ జలాలు కలుషితమవుతాయని, వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంకా, ఈ ప్రాజెక్టు అమలు అయితే గ్రామ ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుందని, ధూళి కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటాయని గ్రామస్తులు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఒక్కటై నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. "అక్రమ మైనింగ్ మాఫియాను అడ్డుకుంటాం", "మా చెరువును కాపాడండి", "ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దు" అంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. వెంటనే ఈ మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని, సంబంధిత అధికారు లను సస్పెండ్ చేయాలని, అలాగే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇచ్చిన అనుమతులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకుండా మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడం అత్యంత బాధాకరమని అన్నారు. ఉపాధ్యక్షుడు జి. పవన్ కుమార్ మాట్లా డుతూ, ఇది కేవలం ఒక గ్రామ సమస్య కాదని, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కీలక అంశమని తెలిపారు. కార్యదర్శి షారుఖ్, సభ్యుడు లోకేష్ కూడా మాట్లాడుతూ, గ్రామ ప్రజల హక్కులను కాపాడేందుకు చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గ్రామ ఉపసర్పంచ్ టి.శ్రీకాంత్, నాయకులు నక్క గిరి ప్రసాద్ మాట్లాడుతూ, ఈ మైనింగ్ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని హెచ్చరించారు. అవసరమైతే మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ ఆందోళనలో దాదాపు 50 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు తమ జీవనాధారం అయిన చెరువును కాపాడేం దుకు ఐక్యంగా నిలబడ్డారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేదంటే తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# "జగన్ పర్యటన సందర్భంగా కాకాణి ఏర్పాట్ల పరిశీలన"




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి నియోజకవర్గం, జువ్వలదిన్నెకు జగన్మోహన్ రెడ్డి రానున్నడంతో మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి గారు, శాసనమండలి సభ్యులు తలశిల రఘురాంతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన, మాజీ మంత్రి వర్యులు, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా.కాకాణి గోవర్ధన్ రెడ్డి. జగన్మోహన్ రెడ్డి ఈనెల 15వ తేదీ జువ్వలదిన్నె రానున్నారని తెలియజేసిన కాకాణి. జువ్వలదిన్నెకు విచ్చేసి ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించనున్నారని వెల్లడించిన కాకాణి. ఏప్రిల్ 15వ తేదీ బుధవారం ఉదయం 09:45 నిమిషాలకు హెలికాప్టర్‌లో జగన్మోహన్ రెడ్డి జువ్వలదిన్నెకు చేరుకుంటారని పేర్కొన్న కాకాణి. జగన్మోహన్ రెడ్డి హయాంలో నిర్మించిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించిన అనంతరం ఉదయం 11 గంటలకు మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని వివరించిన కాకాణి.

జగన్మోహన్ రెడ్డి అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం అవుతారని తెలియజేసిన కాకాణి. జగన్మోహన్ రెడ్డి రాక సందర్భంగా అవ సరమైన హెలిప్యాడ్ నిర్మాణం, ముఖాముఖి కార్యక్రమం నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పిన కాకాణి. కావలి నియోజకవర్గం, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, జగన్మోహన్ రెడ్డి రాకకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తి కావస్తున్నాయని సంతృప్తి వ్యక్తం చేసిన కాకాణి.

# జగనన్న పర్యటనను విజయవంతం చేస్తాం – కాకాణి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి కాకాణిని కలిసి శాలువాలతో సత్కరించి, బొకేలు అందజేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మనుబోలు మండల నాయకులు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో, వైఎస్ ఆర్ సీపీ రాష్ట్ర రైతు విభాగం స్టేట్ సెక్రటరీ కిషోర్ నాయుడు, వైఎస్ ఆర్ సీపీ రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ వెంకట రమణారెడ్డి ఇటీవల పదవులు పొందిన సందర్భంగా మునుబోలు మండల నేతల తో కలిసి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ ఆర్ సీపీ శ్రేణులను అడ్డుకోవడం ఎవరితరం కాదు. జగన్ మోహన్ రెడ్డికి మత్స్యకారుల ప్రయోజనాలే ముఖ్యం. జగన్ మోహన్ రెడ్డి పర్యటనలను అడ్డుకోవాలని పోలీసులు ప్రయత్నించడం సర్వసాధారణం. కూటమి ప్రభుత్వ నిర్ణయాల వల్ల మత్స్యకారులు తమకు అనువైన ప్రదేశాలను కోల్పోతున్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 15వ తేదీన నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి మత్స్యకారుల సమస్యలు తెలుసుకుంటారు. జువ్వలదిన్నెలో మత్స్యకారుల పక్షాన నిలబడనున్న జగన్ మోహన్ రెడ్డి.

కాకాణి స్క్రోలింగ్ పాయింట్స్:

మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పర్యటనల పట్ల కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంది. జగన్ మోహన్ రెడ్డి జనాల్లోకి వస్తే ప్రజల నుండి లభిస్తున్న అపూర్వ స్పందన చూసి కూటమి ప్రభుత్వం భయపడుతోంది. జగన్ మోహన్ రెడి ప్రజల





వద్దకు రాగానే కూటమి ప్రభుత్వ డొల్లతనం బయటపడుతోంది. కూటమి పాలన పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు,అందుకే జగన్ పర్యటనలకు భారీగా జనం తరలి వస్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి మీద ఉన్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం రకరకాల ఆంక్షలు విధిస్తోంది. జగన్ పర్యటనకు కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం పరిపాటిగా మారింది. జగన్ మోహన్ రెడ్డి పర్యటనలను అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతులను అవలంబిస్తోంది. సెక్షన్ 30 యాక్ట్ అమలు చేసి, అనవసరంగా ఆంక్షలు విధించి, జనాలను జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు రాకుండా, ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తుంది. పోలీస్‌లు దారి పొడవునా బారికేడ్లు పెట్టి కార్యకర్తలను ఆపడం, పర్యటనలకు ఆటంకం కలిగించేలా రోడ్లను తవ్వడం, వంటి చర్యలకు పాల్పడడం పరిపాటిగా మారింది. పోలీసుల ద్వారా ఎంతమందిని అడ్డుకున్నా, జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానాన్ని ఆపలేరు. జగన్ వెనుక ఉన్నది కేవలం కార్యకర్తలు మాత్రమే కాదు, ప్రాణాలకు తెగించే 'ఆత్మాహుతి దళం' లాంటి అభిమాన సైన్యం.

జగన్ మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ పర్యటించినా ప్రజలే స్వచ్ఛందంగా తరలి వస్తున్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు. మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరిస్తూ, గత వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మత్స్యకారుల చిరకాల కోరికైన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జగన్ హయాం లోనే జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు 90% పైగా పూర్తయ్యాయి. మత్స్యకారుల సౌకర్యార్థం జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేసి వినియో గంలోకి తీసుకురావడం కోసం ప్రయత్నించాం. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా, మిగిలి ఉన్న స్వల్ప పనులను కూడా పూర్తి చేయడంలో వైఫల్యం చెందింది. మత్స్యకారుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోంది. తీర ప్రాంతంలోని విలువైన భూములను మరియు హార్బర్ ప్రాంతాలను ప్రైవేట్ సంస్థలకు (సాగర్ డిఫెన్స్ వంటివి) అప్ప గించే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల స్థానిక మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద ప్రస్తుతం ఉన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని, మత్స్యకారుల పడవల నిలుపుదలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి, ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల కంటే మత్స్యకారుల ప్రయోజనాలే మాకు ముఖ్యం. సాగర్ డిఫెన్స్‌కు సంబంధించిన కార్యకలాపాల వల్ల మత్స్యకారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హార్బర్‌కు సంబంధించిన సుమారు 79 ఎకరాల స్థలంలో, దాదాపు 29 ఎకరాలు మత్స్యకారులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. మత్స్యకారుల ప్రయోజనాల కోసం వైఎస్ జగన్ నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌లో నేడు మత్స్యకారులకే చోటు లేకుండా పోతోంది. లోకేష్ పేరు మీద వేసిన శిలాఫలకాలను కాపాడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. జువ్వలదిన్నె ప్రాంతంలో సాధారణ ప్రజలెవ్వరినీ రానివ్వకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా జగన్‌ని ప్రజల నుంచి వేరు చేయలేరు. ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి జగన్ మోహన్ రెడ్డికి మద్దతు తెలపనున్నారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 9:45 గంటలకు జగన్ మోహన్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేరుకుంటారు. హార్బర్ ప్రాంతాన్ని పరిశీలించి అనంతరం, 11 గంటలకు స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో మత్స్యకారులతో నేరుగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, అండగా నిలబడతారు. మధ్యాహ్నం 12 గంటలకు జగన్ మోహన్ రెడ్డి తిరిగి ప్రయాణమై వెళ్తారు. మత్స్యకారులందరూ జగన్ పర్యటనలో పాల్గొని, తమ సమస్యలు జగన్ మోహన్ రెడ్డికి తెలియజేయాలని కోరుతున్నా. కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా మత్స్యకారుల పక్షాన పోరాటం ఆపేది లేదు.

# అంతరాష్ట్ర గజదొంగను అరెస్ట్ చేసిన వేదాయపాలెం పోలీసులు











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అంతరాష్ట్ర గజదొంగను అరెస్ట్ చేసిన వేదాయపాలెం పోలీసులు. జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల సోమవారం సాయంత్రం నెల్లూరు టౌన్ వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హౌస్ రాబరీ కేసు వివరాలను టౌన్ ఏఎస్పీ దీక్ష, ఐపిఎస్ సమక్షంలో మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా అంతరాష్ట్ర గజ దొంగను అరెస్ట్ చేసి, సుమారు రూ.17 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడి కదలికలను గుర్తించడం, ఘటన జరిగిన విధానాన్ని తెలుసుకోవడంలో సీసీ టీవీ ఫుటేజీ కీలక పాత్ర పోషించిందని ఎస్పీ వివరించారు.

**కిడ్స్ సేఫ్టీ (వేసవి సెలవుల సూచనలు)**

వేసవి సెలవుల్లో పిల్లలు నీటి కుంటలు, చెరువులు, కాలువల దగ్గర ఆడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పర్యవేక్షణ లేకుండా పిల్లలను బయటకు పంపకూడదు. ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలి. బీచ్‌లలో అండర్ వాటర్ కరెంట్స్ వల్ల జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**రోడ్ సేఫ్టీ**

గత క్వార్టర్‌తో పోలిస్తే ఈ క్వార్టర్‌లో రోడ్డు ప్రమాదాలు 20% తగ్గినట్లు తెలిపారు. జిల్లాలో గుర్తించిన అన్ని బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. జిల్లా పోలీస్, ఆర్‌టిఏ, ఫైర్ శాఖలతో కలిసి ప్రైవేట్ మరియు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై సంయుక్త తనిఖీల కోసం 13 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఫైర్ ఎక్స్టింగ్విషర్స్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, రేడియం మార్కింగ్ తదితర భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు కట్టుదిట్టంగా చూడాలి. మర్రిపాడు – డిసి పల్లి ప్రాంతాల్లో పశువుల వల్ల జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామని తెలిపారు.

**సైబర్ సేఫ్టీ**

ఈజీ మనీ ఆశతో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్‌కు గురి కాకూడదు. స్కామ్ కాల్స్, ఓటిపి మోసాలు, ఆన్లైన్ జాబ్ ఫ్రాడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు మొబైల్ మరియు ఇంటర్నెట్ వినియోగంపై తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలి. అనుమానాస్పద లింకులు, గేమ్స్, ఏపికె ఫైల్స్, సోషల్ మీడియా మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వ్యక్తిగత సమాచారం ఎవరికీ పంచుకోవద్దని అవగాహన కల్పించాలి.

**ప్రజలకు సూచనలు**

అనుమానాస్పద వ్యక్తులు లేదా చర్యలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో 100, 112 లేదా 9392903413 నంబర్లకు కాల్ చేయాలి. పోలీసులతో ప్రజలు సహకరిస్తేనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుంది. ఈ సందర్భంగా కిడ్స్ సేఫ్టీ మరియు ఎల్‌హెచ్‌ఎంఎస్ అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పీ మీడియా సమక్షంలో ఆవిష్కరించారు.




# దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నాగేంద్ర జన్మదిన వేడుకలు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఎన్.టి.ఆర్. నగర్ తెలుగు యువత అధ్యక్షులు మరియు 11వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొడ్డేటి నాగేంద్ర జన్మదిన వేడుకలు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హాజరై కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా తమ్ముడు నాగేంద్ర ప్రజాసేవలో ముందుండాలని ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో చేసుకోవాలని ఇంకా పేద ప్రజలకు సహాయం చేయాలని ఇంకా రాజకీయంగా పైకి ఎదగాలని తన తోటి ఉండే మిత్రులను కూడా అదే రకంగా చూసుకోవాలని నిండు నూరేళ్లు ఆ సాయిబాబా ఆశీస్సులు ఉండాలని ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్నేహితులు, బంధువులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# కలిసికట్టుగా అడుగులు... వ్యూహాలు...టీడీపీ బేజార్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితో భేటీ అయిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. ఈ సందర్భంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం తదితర అంశాలను వారు చర్చించారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా భారీ సంఖ్యలో భారీ జన సమీకరణ చేయాలని నిర్ణయించారు.

# తూర్పు జోన్‌లో ఏప్రిల్ 16న బహిరంగ వేలం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ తూర్పు జోన్ పరిధిలో ఖాళీగా వున్న షాపు రూములు, కళ్యాణ మండపములు, ఖాళీ స్థలంలకు ఏప్రిల్ 16న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడునని తూర్పు జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ సోమవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. తూర్పు జోన్ పరిధిలో గల ఖాళీగా వున్న షాపు రూములు, కళ్యాణ మండపములు, ఖాళీ స్థలంలకు 3 సంవత్సరముల కాలమునకు గుత్తలకు ఇచ్చుటకుగాను తేది: 16-04-2026 న ఉదయం 11 గంటలకు తూర్పు జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని, ఆసక్తి గల పాటదారులు పూర్తి వివరాలకు తూర్పు జోనల్ కమిషనర్ కార్యాలయం లోని పని వేళలో కార్యలయ పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.



# సంపాదకీయం

## అంబేడ్కర్ తొలి ప్రధాని అయివుంటే...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, భారత్ కేవలం రాజకీయ స్వేచ్ఛ మాత్రమే కాదు, నాగరికత పునర్నిర్మాణ అంచులపై కూడా నిలిచింది. అలాంటి సమయంలో నాయకత్వం కేవలం పరిపాలనను మాత్రమే కాకుండా దేశ స్వరూపాన్ని, భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఆ సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ పదవిలోకి వచ్చారు. కానీ అదే కాలంలో అత్యంత నిర్మాణాత్మకంగా ఆలోచించే మరో మహత్తర మేధస్సు అధికారానికి దూరంగా నిలిచింది. అది డా. బి.ఆర్. అంబేడ్కర్. ఆయన కేవలం రాజ్యాంగ శిల్పి మాత్రమే కాదు, భారతదేశాన్ని ఒక సంక్లిష్ట జీవిగా అర్థం చేసుకున్న తత్వవేత్త, సామాజికంగా విభజితమైన, ఆర్థికంగా అసమానమైన, వ్యూహాత్మకంగా బలహీనమైన దేశంగా చూశాడు. ఆయన దృష్టి అలంకారాత్మకమైనది కాదు; అది పునాది స్థాయిలో ఉన్నది. ఆయన భారతదేశపు తొలి ప్రధానమంత్రిగా ఉంటే, ఈ గణతంత్రం కేవలం స్వేచ్ఛా దేశంగా మాత్రమే కాకుండా, ఈ రోజుకి ఒక ప్రపంచ శక్తిగా ఎదిగేది. ఇప్పుడు భారత్ విభజన, దాని వల్ల ఏర్పడ్డ నిరంతర సమస్యలను పరిశీలిద్దాం. స్వతంత్ర భారతదేశం ఎదుర్కొన్న మొదటి, అత్యంత కీలక సమస్య విభజనే. అనేకమంది నాయకులు దీనిని భావోద్వేగ పూరితంగా, ఒక విషాద ఘట్టంగా చూశారు. కానీ అంబేడ్కర్ దీనిని విశ్లేషణాత్మకంగా చూశారు. తమను తాము వేర్వేరు జాతులుగా భావించే రెండు సమూహాలు నిరంతర ఘర్షణ లేకుండా కలిసి జీవించగలవా? ముస్లింలకు ప్రత్యేక దేశం కోసం జిన్నా చేసిన డిమాండ్‌ను అంబేడ్కర్ అనివార్యంగా మాత్రమే కాకుండా, ఒక అవకాశంగా కూడా చూశారు. కానీ చరిత్రలో చోటుచేసుకున్న అస్తవ్యస్తతకు బదులుగా, అంబేడ్కర్ పథకం ప్రకారం వ్యవహరించేవారు. తొందర పాటుతో జరిగిన విభజనకు బదులుగా, ఆయన దశల వారీ మార్పును నిర్దేశించేవారు. 1) హడావిడిగా కాకుండా రెండు నుంచి మూడు సంవత్సరాల ప్రణాళికబద్ధంగా విభజన జరిగేది. 2) స్పష్టమైన సరిహద్దుల నిర్ధారణ జరిగేది. 3) భూభాగ విభజన, ఆస్తుల విభజన జనాభాకు అనుగుణంగా ఉండేది. ఉదాహరణకు విభజన సమయంలో భారత్‌లోని మొత్తం ముస్లిం జనాభాలో కేవలం 60శాతం పాకిస్థాన్‌లో స్థిరపడ్డారు, కాని 40 శాతం భారత్‌నే ఎంచుకున్నారు. 3) ముఖ్యంగా ఆయన భారత్-పాకిస్థాన్ మధ్య సంపూర్ణ జనాభా మార్పిడిని గ్రీకు-టర్కీ నమూనాలో ప్రతిపాదించారు. దీని ద్వారా దీర్ఘకాలిక సామాజిక అస్థిరతను నివారించవచ్చని ఆయన నమ్మారు. లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం, కోట్ల మంది నిరాశ్రయులు కావడం వంటి విషాదాలు గణనీయంగా తగ్గేవి. విభజన తాత్కాలిక బాధ, దీర్ఘకాల లబ్ధిగా మారేది. అంబేడ్కర్ ప్రధానమంత్రిగా జమ్మూ-కశ్మీర్‌ను తక్షణం, పూర్తిగా రాజ్యాంగపరంగా ఏకీకృతం చేసేవారు. దీర్ఘకాల అంతర్జాతీయాకరణ, అనిశ్చితి ఉండేవి కాదు. ఆర్టికల్ 370 వంటి ప్రత్యేక హోదాను అంగీకరించేవారు కాదు. మొత్తం కశ్మీర్ భారతదేశంలో ఒక సాధారణ రాష్ట్రంలా కలిసిపోయేది. ఆర్థిక శాస్త్రవేత్తగా, జల విధాన నిపుణుడిగా, ఆయన నదులను జాతీయ శక్తి సాధనాలుగా చూశారు. ఇండస్ నదులపై ప్రవాహ వినియోగాన్ని గరిష్ఠంగా పెంచేవారు, ముందుగానే సాగునీటి మౌలిక సదుపాయాలను నిర్మించేవారు, ఏ ఒప్పందాన్నైనా పరస్పర ప్రయోజనం-వ్యూహాత్మక లాభాల ఆధారంగా చర్చించేవారు. ఆయన దృష్టిలో నీరు కేవలం జలశక్తిగా కాకుండా దేశానికి సైనిక శక్తిగా మార్చేవారు. నదుల అనుసంధానం, అలానే అంతర్రాష్ట్ర నీటి తగాదాలు లేకుండా ఒక స్పష్టమైన జాతీయ విధానం అమలు చేసేవారు. టిబెట్‌ను ఒక బఫర్ ప్రాంతంగా కోల్పోవడం వల్ల కలిగే పరిణామాలను అంబేడ్కర్ ముందుగానే అంచనా వేశారు. టిబెట్ స్వతంత్రత కోల్పోతే, భారతదేశం చైనాతో ప్రత్యక్ష ఒత్తిడిని ఎదుర్కొంటుందని హెచ్చరించారు. ఆయన విధానం చైనా విస్తరణకు వ్యతిరేకంగా బలమైన రాజనీతి చర్యలు తీసుకునేందుకు, టిబెట్ స్థితిని అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించడం అయ్యేది. అలాగే నేపాల్-మయన్మార్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాలు లేదా ఏకీకరణ ద్వారా ఒక రక్షణ వలయాన్ని సృష్టించేవారు. విభజనతో భారతదేశం సెంట్రల్ ఆసియాతో తన సంబంధాన్ని కోల్పోయింది. ఇది అంబేడ్కర్ అంగీకరించేవారు కాదు. ఆయన ఆర్థిక భౌగోళిక దృష్టిలో, సరిహద్దు ప్రాంతాల ద్వారా ట్రాన్సిట్ కారిడార్లను ఏర్పరచి, భారతదేశం ఖండాంతర వాణిజ్య మార్గాలతో అనుసంధానంగా ఉండేలా చేసేవారు. విభజనకు ముందు షరతుగా దీనిని ఉంచేవారు. కలాత్ (బలోచిస్తాన్) సంస్థానాన్ని భారతదేశంలో కలపడానికి వచ్చిన అవకాశాన్ని జవహర్‌లాల్ నెహ్రూ తిరస్కరించడం వ్యూహాత్మక లోపంగా మారింది. ఖాన్ ఆఫ్ కలాత్ చేసిన విలీన అభ్యర్థనను అంగీకరించి ఉంటే, గ్వాదర్ పోర్ట్ ప్రాప్తి, ఇరాన్-అఫ్గానిస్తాన్‌తో భౌగోళిక అనుసంధానం లభించేవి, భారతదేశ ఆర్థిక, భౌగోళిక పరపతి ప్రపంచానికి అనివార్యం కల్పించేది. సంస్థానాల విలీన ప్రక్రియను అంబేడ్కర్ మరింత కఠినంగా అమలు చేసేవారు. హైదరాబాద్ సంస్థానాన్ని 1948లో సర్దార్ వల్లభభాయ్ పటేల్ సైనిక చర్య ద్వారా విలీనం చేశారు. అంబేడ్కర్ నేతృత్వంలో ఇది మరింత ముందుగానే జరిగి ఉండేది. గోవా 1961 వరకు పోర్చుగీసు వలస పాలనలో కొనసాగడం అంబేడ్కర్ దృష్టిలో సరికాదు. ఆయన ఒక కచ్చితమైన కాలపరిమితి విధించి, అవసరమైతే తక్షణ చర్య తీసుకునేవారు. సార్వభౌమత్వం విషయంలో ఆయన ఏ మాత్రం రాజీపడేవారు కారు. ఒక ఆర్థికవేత్తగా, దూరదృష్టితో స్టేట్ సోషలిజం విత్ ప్రైవేట్ క్యాపిటలిజం అనే సిద్ధాంతంతో, 1991లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల మోడల్ ప్రవేశపెట్టేవారు. భూసంస్కరణలు, పారిశ్రామీకరణ, లేబర్ రైట్స్, నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్, ఆర్థిక విప్లవానికి నాంది పలికేవారు.

# ఘనంగా న్యూ స్మార్ట్ ఏంజిల్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవం – చిన్నారుల ప్రదర్శనలు అమోఘం






**విశాఖ: మధురవాడ, (రాజధాని వార్తలు):** మధురవాడ గణేష్ నగర్‌లోని న్యూ స్మార్ట్ ఏంజిల్స్ ప్లే స్కూల్ 8వ వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం స్థానిక శిల్పారామం (జాతర) వేదికగా అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ రోహిణి వత్సవాయి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు పరుశురామరాజు, పి.ఎం.పాలెం సీఐ జి. బాలకృష్ణ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నతనం నుంచే పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంలో ప్లే స్కూల్స్ కీలక పాత్ర పోషిస్తాయని కొనియాడారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపి సీనియర్ నాయకులు పిల్లా వెంకటరావు, నమ్మి రమణ, జనసేన నాయకులు కొర్రాయి సురేష్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ,పాఠశాల యాజమాన్యం అందిస్తున్న నాణ్యమైన విద్యను వారు ప్రశంసించారు.? వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగు రంగుల దుస్తుల్లో చిన్నారులు చేసిన నృత్యాలు, నాటికలు అలరించాయి. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు అతిథుల చేతుల మీదుగా పట్టాల ప్రదానం జరిగింది.

విద్యార్థులకు, క్రీడల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయ కులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 102 వినతులు : జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీలో అన్ని విభాగాలకు కలిపి 102 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మలతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 102 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా మధురవాడ జోన్‌కు 22, ఈస్ట్ జోన్‌కు 11, వెస్ట్ జోన్ కు 02, నార్త్ జోనుకు 14, సౌత్ జోన్‌కు 12, పెందుర్తి జోన్‌కు 4, అగనంపూడి జోన్‌కు 03, గాజువాక జోన్‌కు 08, అనకాపల్లి జోన్‌కు 03, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 23 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 15, రెవెన్యూ విభాగమునకు 08, ప్రజారోగ్య విభాగమునకు 03, పట్టణ ప్రణాళిక విభాగమునకు 56, ఇంజినీరింగు విభాగమునకు 14, యుసిడి విభాగమునకు 06 కలిపి మొత్తంగా 102 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదేరోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను కమిషనర్ ఆదేశించారు.

అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందరు జోనల్ కమిషనర్లతో మాట్లాడుతూ ప్రతి జోనల్ కమిషనర్ ఒక నెలలో 10 సచివాలయాలను తప్పకుండా సందర్శించి అక్కడ ప్రజలకు అందిస్తున్న సేవలను, సంబంధిత అర్జీలను, సమస్యల పరిష్కారాలను నిషితంగా పరిశీలించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు పి.నల్లన్నయ్య, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి.విజయ భారతి, ప్రధాన ఇంజనీర్ పీవీ సత్యనారాయణ రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఏ.ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్. శ్రీనివాసరావు, ఎడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, ఆర్.ఎఫ్.ఒ కృపావరం, పర్యవేక్షక ఇంజనీర్లు, డిసీపీ లు, ఏసీపీ లు, యుసిడి–డి.పి.ఒ శాంతి కుమారి, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎల్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అప్పన్నకు తొలి విడత చందనము అరగదీత ప్రారంభం

## - చందనోత్సవం రోజు రాత్రికి తొలి విడత మూడు మనుగుల చందన సమర్పణ - ఉత్సవాల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం : గంట్ల





**విశాఖ: సింహాచలం, (రాజధాని వార్తలు):** ప్రపంచంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈనెల 20న సింహాద్రి నాథుడు చందనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా వైశాక శుద్ధ తదియనాడు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఈ ఏడాది కూడా అత్యంత ప్రతిష్టా త్మకముగా నిర్వహించనున్నారు. ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ ఈవో జే వెంకటరావు ఆధ్వర్యంలో శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

**తొలి విడత చందనం అరగదీత ప్రారంభం**

చందనోత్సవం రోజు రాత్రికి భక్తులు దర్శనాలు అనంతరం తొలివిడతగా సింహాద్రినాథుడుకి మూడు మనుగులు చందనాన్ని వైభవంగా సమర్పించనున్నారు. దీంతో సోమవారం వైశాఖ మాసం ఏకాదశి పర్వదిన సందర్భంగా తెల్లవారుజామున ప్రత్యేక పూజలు అనంతరం తొలి విడతగా చందనం అరగదీత కార్యక్రమం ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు కరి సీతారామాచార్యులు స్థానాచార్యులు టిపి రాజగోపాల్ ఆలయ ఈవో జే వెంకట్రావు ఏఈఓ తిరుమలేశ్వరరావు సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తదితరులు చందనము అరగదీత కార్యక్రమంలో పాల్గొన్నారు.

తొలుత అర్చక వర్గాలు చందనం

అరగదీత ప్రారంభించారు. అత్యంత మహిమాన్వితమైన సింహాద్రి నాథుడి ఉత్సవాల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు చెప్పారు.

# విమర్శల్లో హుందాతనం ఎక్కడ హోం మంత్రి? మీరు మహిళ అన్న విషయమే మరచిపోయారా? : జమ్మలమడక



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి తమ వ్యాఖ్యల్లో మర్యాద, హుందాతనం పాటించడం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్రంగా విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలుగుదేశం పార్టీ నేతలు నారా చంద్రబాబు నాయుడు మరియు నారా లోకేష్ మెప్పు కోసం హోం మంత్రి అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలించినప్పటికీ, ఆయనను విమర్శించడానికే ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. అమరావతి రాజధాని విషయంలో ఆయన చేసిన సూచనలపై విభేదాలు ఉంటే, వాటిని స్పష్టంగా చెప్పాల్సింది పోయి "గొడ్డలిపోటు" అంటూ రాజకీయ డైవర్షన్ చేయడం సరికాదన్నారు. అవసరమైతే తమ పార్టీ కూడా గతంలో జరిగిన వెన్నుపోటు, హత్యా రాజకీయాలపై మాట్లాడగలదని హెచ్చరించారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు మరణం, ఆయన కుటుంబ విభజనపై ప్రజలకు నిజాలు తెలుసని పేర్కొన్నారు. ఇక మాజీ హోం మంత్రి మాధవరెడ్డి, లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి, మాజీ ఎంపీ ఎర్రంనాయుడు వంటి నేతల మరణాలపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయని, ఇవి సోషల్ మీడియాలో ప్రజలే చర్చిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత హోం మంత్రి ఒక ఉన్నత విద్యావంతురాలు, ఉపాధ్యాయురాలు అయినప్పటికీ, ఉన్నత పదవికి తగిన విధంగా ప్రవర్తించడం లేదని విమర్శించారు. నాయకుల మాటలకు అనుగుణంగా కాకుండా, స్వీయ సంస్కారం పాటించాలని సూచించారు. కరోనా సమయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా పారాసిటమాల్ ఉపయోగంపై సూచనలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అప్పట్లో జగన్ చేసిన సూచనలను వ్యంగ్యంగా తీసుకున్నవారు ఇప్పుడు ఏమంటారని ప్రశ్నించారు. అమరావతి రాజధాని పేరుతో భారీ రియల్ ఎస్టేట్ వ్యాపార ప్రయోజనాల కోసం కొంతమంది నేతలు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి రూ. 2 లక్షల కోట్ల వ్యయం భరించే స్తోమత లేదని గుర్తించిన జగన్, తక్కువ వ్యయంతో మచిలీపట్నం–విజయవాడ–గుంటూరు మధ్య రాజధాని ప్రతిపాదన చేయడంలో తప్పేముందని నాగమణి ప్రశ్నించారు. చివరగా, రాజకీయ విమర్శలు చేయాలంటే అవి మర్యాదపూర్వకంగా ఉండాలని, తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హోం మంత్రికి హితవు పలికారు.

# రచయిత గెద్దాడ కస్తూరి ప్రసాద్‌కు గౌతమ్ బుద్ధ ఫెలోషిప్ అవార్డు

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తూ, సమాజ చైతన్యానికి అంకితభావంతో పనిచేస్తున్న ప్రముఖ రచయిత గెద్దాడ కస్తూరి ప్రసాద్ (రాధిక అనే కలం పేరుతో ప్రసిద్ధి)కి గౌతమ్ బుద్ధ ఫెలోషిప్ అవార్డు ప్రదానం చేయబడింది. పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రదానోత్స వం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 12 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసి అవార్డులతో సత్కరించారు. కాకినాడలోని జేఎన్టీయూ ప్రాంగణంలో సోమవారం జరిగిన ఈ వేడుకకు విశేష స్పందన లభించింది. ఈ అవార్డులను జేఎన్టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా ప్రారంభించి, సత్కారాలు, అభినందనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థగా అభివర్ణించారు. అంబేద్కర్ జయంతి వంటి ప్రాధాన్యమైన సందర్భంలో సమాజ సేవకులను గుర్తించి సత్కరించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన రచయిత గెద్దాడ కస్తూరి ప్రసాద్ గురించి మాట్లాడుతూ రాధిక అనే కలం పేరుతో వందలాది కథలు, కథానికలు, నవలలు రచించి తెలుగు సాహిత్యానికి విశేష సేవలు అందించినట్లు తెలిపారు. ఆమె రచనలు సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ, పాఠకుల్లో చైతన్యం కలిగించే విధంగా ఉంటాయని కొనియాడారు. కొత్త తరానికి మార్గదర్శిగా, ఎంతో మంది యువ రచయితలకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కస్తూరి ప్రసాద్ కూడా ఈ సందర్భంగా స్పందిస్తూ, తనకు లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతను కలిగించిందని, భవిష్యత్తులో కూడా సమాజానికి ఉపయోగపడే రచనలు చేయడానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు, సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, నగర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, సత్కారాలతో ముగిసింది.

# 'జన నాయగన్' ప్రాపగండ మూవీనా?



కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన చివరి మూవీ జన నాయగన్ వివాదం చిత్ర విచిత్రైన మలుపులు తిరుగుతోంది. సెన్సార్ క్లియరెన్స్ కారణంగా రిలీజ్ గత కొన్ని నెలలుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ సినిమా రిలీజ్ విషయంలో ఇప్పటికీ ఎలాంటి స్పష్టత రరాలేదు. దీంతో అభిమానులు ఎప్పుడెప్పుడు సినిమా రిలీజ్ అవుతుందా? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తమిళ నాట అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మూవీ రిలీజ్‌ని సెన్సార్ సిబ్బంది కావాలనే వాయిదా వేసినట్టుగా అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ నేపథ్యంలోనే సినిమాకు సంబంధించిన కీలక క్లిప్‌లు లీక్‌కు గురై నెట్టింట సర్క్యులేట్ కావడం తీవ్ర కలలకం రేపుతోంది. ఇప్పటికే దీన్ని మేకర్స్ సీరియస్‌గా తీసుకుని లీక్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలకు దిగారు. చెన్నైలో ఈ సినిమా క్లిప్‌ల లీక్ వ్యవహారంలో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. తాజాగా ఓ లోకల్ ఛానల్‌లో జన నాయగన్ క్లిప్‌లు ప్రసారం కావడంతో సదరు లోకల్ ఛానల్ యజమానిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే తమిళనటి, పొలిటికల్ లీడర్ కస్తూరి జన నాయగన్‌పై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ సినిమాని విజయ్ తన పార్టీ ప్రచారం కోసం చేసుకున్నారని, ఇదొక ప్రాపగండ మూవీ అని విమర్శలు చేసింది. అంతే కాకుండా లీక్ అయిన క్లిప్‌లను వాట్సాప్, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లలో చూశానని, ఈ క్లిప్‌లని బట్టి చూస్తుంటే సినిమా ఓ ప్రాపగండ మూవీ అని, తన పార్టీని హైలైట్ చేస్తూ బీజేపీపై బురదజల్లే విధంగా సినిమాని రూపొందించారని సంచలన వ్యాఖ్యలు చేసింది. అంతే కాకుండా ఈ సినిమా గురించి నేను కొత్త విషయాలు తెలుసుకున్నానని, ప్రజలు ఈ సినిమా చూస్తే విజయ్ టీవీకె పార్టీకి లాభం చేకూరేలా ఉందని, బీజేపీ, డీఎంకెలని విమర్శించినట్టుగా ఉందని పేర్కొంది. దీంతో కస్తూరి చేసిన కామెంట్స్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారి నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. కస్టూరి లీకైన క్లిప్‌లని చూడటంపై కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నారు. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తి అయి ఉండి ఇలా పైరసీ క్లిప్‌ని చూడటం ఏంటని కామెంట్‌లు చేస్తున్నారు. దీంతో కస్తూరి చేసిన కామెంట్స్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.

# నివేదా పేతురాజ్ మళ్లీ సినిమాల్లోకి!



లవ్‌స్టోరీలు, బ్రేకప్‌లు టాలీవుడ్‌లో చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ సంస్కృతి టాలీవుడ్‌లో చాలా అరుదు. బాలీవుడ్‌లో అయితే ప్రతి సినిమాలకు ఇలాంటి కథలు, స్టోరీలు వినిపిస్తూనే ఉంటాయి. డేటింగ్‌లు, బ్రేకప్‌లు అక్కడ సర్వసాధారణం. కానీ సౌత్‌లో మరీ ముఖ్యంగా టాలీవుడ్‌లో మాత్రం ఇలాంటివి చాలా అరుదు. కానీ అవి టాలీవుడ్‌లోనూ ఈ మధ్య ఎక్కువయ్యాయి. హీరోయిన్‌లు, హీరోల ప్రేమలో పడటం, పెళ్లి వరకు వెళ్లడం జరుగుతోంది. కొన్ని దశాబ్దాల క్రితం ఉన్న ఈ సంస్కృతి టాలీవుడ్‌లో మళ్లీ ఇటీలే మొదలైంది. హీరోలు ఈ మధ్య హీరోయిన్‌లని ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నారు. కొంత మంది విడాకుల వరకు వెళితే మరి కొందరు ఆదర్శంగా నిలుస్తూ దేశ వ్యాప్తంగా వారి హ్యూమానిటీతో ట్రెండ్ అవుతున్నారు. ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదిలా ఉంటే టాలీవుడ్ హీరోయిన్‌లలో కొంత మంది ఇండస్ట్రీకి సంబంధం లేని వారిని ప్రేమించి మెహ్రీన్ లాంటి వాళ్లు పెళ్లి దాకా వెళ్లి దాన్ని రద్దు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు అదే జాబితాలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా చేరింది. దుబాయ్ బేస్డ్ బిజినెస్ మేన్ రజిత్ ఇబ్రాన్‌తో కొంత కాలం ప్రేమలో ఉన్న నివేదా ఈ విషయాన్ని గత ఏడాది ఆగస్టులో సోషల్ మీడియా వేదికగా వెల్లడించి ఆశ్చర్యపరిచింది. అక్టోబర్‌లో నిశ్చితార్థం.. 2026లో వివాహం చేసుకోవాలని ఈ జంట ప్లాన్ చేసుకుంది అని వార్తలు వినిపించాయి. అయితే ఆ తరువాత ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ నివేదా పేతురాజ్ తన ఇన్‌స్టా అకౌంట్‌లో రజిత్‌కు సంబంధించిన ఫొటోలని తొలగించింది. దీంతో నిశ్చితార్థం రద్దయిందని స్పష్టమైంది. ఆ తరువాత దీని నుంచి బయటపడటం కోసం కొంత కాలం పాటు విదేశాలకు వెళ్లింది. తిరిగి వచ్చాక దుబాయ్ నుంచి చెన్నైకి మకాం మార్చింది.

తను ప్రేమించిన వ్యక్తి కోసం కెరీర్‌ని కూడా పక్కన పెట్టి సినిమాలకు దూరంగా ఉన్న నివేదా పేతురాజ్ మళ్లీ సినిమాల్లో మునుపటి తరహాలోనే రాణించాలని ప్లాన్ చేసుకుంటోందట. సెకండ్ హీరోయిన్ క్యారెక్టర్‌లకు సైతం ఓకే చెప్పేయాలనే ఆలోచనతో ఉందని, గత మూడేళ్లుగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటూ వచ్చిన నివేదా మళ్లీ సినిమాల్లో బిజీ కావాలని అందరితో టచ్‌లో ఉంటోందట. ఇందుకోసం తెలుగులోనూ ప్రయత్నాలు మొదలు పెట్టినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె రీఎంట్రీకి అవకాశం ఏ హీరో, డైరెక్టర్ ఇవ్వబోతున్నారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మెంటల్ మదిలో సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన నివేదా పేతురాజ్‌కు చిత్రలహరి, బ్రోచే వారెవరురా, అల వైకుంఠపురములో, దాస్ క ధమ్కీ వంటి సినిమాలు మంచి పేరు తెచ్చి పెట్టాయి.

# పాలీ అమ్మాయిని.. పూణెలో పుట్టా!



ఇండస్ట్రీలో కొత్తగా వినిపిస్తున్న పేర్లలో ఇప్పుడు ముందు వరుసలో నిలుస్తోంది కయాదు లోహర్. టాలీవుడ్ మాత్రమే కాకుండా మొత్తం సౌత్ సినీ పరిశ్రమలో ఈ యంగ్ హీరోయిన్ తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటూ దూసుకుపోతోంది. ఇటీవల ఆమె వ్యక్తిగత గుర్తింపు గురించి సోషల్ మీడియాలో వచ్చిన చర్చలకు కయాదు స్వయంగా ఇచ్చిన సమాధానం మరింత ఆకర్షణగా మారింది. తాను నేపాలీ అని, కానీ పూణెలో పుట్టి పెరిగానని, తమ పెద్దలు అస్సాంలో సెటిలయ్యారంటూ తన మూలాలు, పెంపకం గురించి స్పష్టంగా చెప్పింది. ఈ క్లారిటీ ఆమె వ్యక్తిత్వాన్ని మరింత బలంగా చూపించిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

**బాక్సాఫీస్ వద్ద ఫ్లాపుగా నిలిచిన ఫంకీ**

ఇదిలా ఉండగా, సినిమాల పరంగా కూడా కయాదు కెరీర్ ఆసక్తికర మలుపు తిరిగింది. తెలుగులో ఆమె నటించిన ఫంకీ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, ఆమె క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఫంకీ ఫ్లాప్ తర్వాతే కయాదుకి మరింత గుర్తింపు రావడం గమనార్హం. ఇండస్ట్రీలో ఒకప్పుడు అవకాశాల కోసం ఎదురుచూసిన ఈ బ్యూటీ, ఇప్పుడు స్టార్ దర్శకులు, నిర్మాతలు ఆమె డేట్స్ కోసం వెయిట్ చేసే స్థాయికి చేరుకుంది. అస్సాం నుంచి వచ్చి తక్కువ కాలంలోనే సౌత్‌లో గుర్తింపు తెచ్చుకోవడం ఆమె కెరీర్‌లో ప్రత్యేకమైన అంశంగా చెప్పాలి.

**డ్రాగన్‌తో కెరీర్ టర్న్**

కయాదు కెరీర్లో ప్రదీప్ రంగనాథన్ సరసన చేసిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమా కీలక మలుపుగా నిలిచింది. ఆమె కెరీర్ ను ఈ సినిమాకు ముందు, తర్వాతగా విభజించవచ్చని చెప్పొచ్చు. బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ సినిమా ద్వారా ఆమె నటనకు యూత్ నుంచి విపరీతమైన స్పందన లభించింది. అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని కయాదు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమాతో వచ్చిన క్రేజ్ కారణంగా ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం సౌత్‌లో మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఒకరిగా కయాదు ఎదిగింది.

**పలు భాషల్లో బిజీగా..**

ప్రస్తుతం కయాదు చేతిలో ఏకంగా ఏడు సినిమాలుండటం విశేషం. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, మలయాళ భాషల్లో కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కథలో బలం ఉన్న ప్రాజెక్టులను ఎంచుకోవడం ద్వారా తన ఇమేజ్‌ను బలోపేతం చేసుకుంటోంది కయాదు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అవకాశాలను ఉపయోగించుకుంటూ కెరీర్‌ను పటిష్టంగా నిర్మించుకుంటోంది అమ్మడు. ముఖ్యంగా నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో ఆమె పాత్రపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. ఈ సినిమా సక్సెస్ అయితే టాలీవుడ్‌లో కయాదు స్థాయి మరింత పెరగడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మొత్తంగా చూస్తే, వ్యక్తిగత గుర్తింపు నుంచి ప్రొఫెషనల్ గ్రోత్ వరకు ప్రతి అంశంలో కయాదు లోహర్ స్పష్టతతో ముందుకు సాగుతోంది. ఇండస్ట్రీలో స్థిరమైన స్థానం సంపాదించడమే లక్ష్యంగా కష్టపడుతున్న ఈ యంగ్ హీరోయిన్, రాబోయే రోజుల్లో టాప్ హీరోయిన్ రేసులో ముందంజలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# హిట్‌మెషీన్ మూవీకి అప్పుడే క్రేజీ డీల్స్!



బ్లాక్ బస్టర్ డైరెక్టర్స్ హీరోలు అందుబాటులో లేకపోవడంతో నెక్ట్స్ సినిమా కోసం టైమ్ తీసుకుంటుంటే హిట్ మెషీన్‌గా పేరు తెచ్చుకున్న అనిల్ రావిపూడి మాత్రం వెంటనే క్రేజీ సినిమాని పట్టాలెక్కించడానికి రెడీ అవుతున్నారు. 2025 సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ని తన ఖాతాలో వేసుకోవడమే కాకుండా పీకల్లోతు కష్టాల్లో ఉన్న దిల్ రాజుని సేఫ్‌గా బయట పడేసి శభాష్ అనిపించుకున్నారు. అదే జోష్‌తో 2026 సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా కామెడీ ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా మన శంకరవరప్రసాద్ గారుని అందించి మరో బ్లాక్ బ్టర్ హిట్‌ని తన ఖాతాలో వేసుకుని హిట్ మెషీన్ అనిపించుకున్నారు. సంక్రాంతి బరిలో నిలిచిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించి రికార్డు స్థాయిలో వసూళ్లని రాబట్టింది. చిరు సినిమాల్లో రూ.300 కోట్లు రాబట్టిన మూవీగా రికార్డు సాధించింది. ఈ బ్లాక్ బస్టర్ సక్సెస్ తరువాత అనిల్ రావిపూడి ఎవరితో సినిమా చేస్తాడనే చర్చ జరిగింది. వెంకీతో తదుపరి మూవీని చేస్తాడని అంతా అనుకున్నారు. అయితే అందుకు భిన్నంగా వెంకటేష్, కల్యాణ్ రామ్‌ల కాంబినేషన్‌లో నెక్ట్స్ ప్రాజెక్ట్‌ని ప్లాన్ చేశాడు అనిల్ రావిపూడి. సంక్రాంతి హిట్ ఫార్ములాని రిపీట్ చేస్తూ తనదైన మార్కు యాక్షన్ కామెడీ డ్రామాగా ఈ మూవీని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఈ భారీ మల్టీస్టారర్ స్క్రిప్ట్ ఫస్ట్ హాఫ్ ఇప్పటికే పూర్తయింది. జూన్ నుంచి రెగ్యులర్ షూటింగ్‌ని స్టార్ట్ చేయడానికి టీమ్ రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబం ధించిన ఆసక్తికరమైన ఓ విషయం బయటికి వచ్చింది. షూటింగ్ ఇంకా ప్రారంభించకుండానే నాన్ థియేట్రికల్ రైట్స్ ఆల్ టైమ్ రికార్డు స్థాయి ధరకు సేల్ అయినట్టుగా టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. 2027 సంక్రాంతి బరిలోకి దిగనున్న ఈ సినిమా షూటింగ్‌కు ముందే నాన్ థియేట్రికల్ రైట్స్ విషయంలో భారీ మొత్తాన్ని దక్కించుకోవడంతో సినిమా థియేట్రికల్ బిజినెస్ ఇంకెలాంటి షాక్ ఇస్తుందో అని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. సాహు గారపాటి షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై నిర్మించనుండగా ఈ మూవీకి జీ స్టూడియోస్ సహ భాగస్వామిగా వ్యవహరించనుంది. కృతిశెట్టితో పాటు మరో క్రేజీ హీరోయిన్ నటించనున్న ఈ సినిమా రానున్న సంక్రాంతికి ఎలాంటి మ్యాజిక్‌ని క్రియేట్ చేస్తుందో వేచి చూడాల్సిందే. పటాస్ తరువాత కల్యాణ్ రామ్‌తో కలిసి అనిల్ రావిపూడి చేస్తున్న ఈ మూవీపై ఆయన అభిమానులు భారీ అంచనాలే పెట్టుకున్నారట.

# మీ ప్రేమ, అభిమానానికి నా హృదయంలో ఎప్పటికీ స్థానం

## - తాత పేరుతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు సంతృప్తి ఇచ్చింది - సీఎం ఇచ్చిన అవకాశంతో నియోజకవర్గ, జిల్లా అభివృద్ధికి శాయశక్తుల కృషి - వైభవంగా మంత్రి కొండపల్లి జన్మదిన వేడుకలు - నియోజకవర్గ, జిల్లా నుంచి భారీగా తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మీ ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి నా హృదయంలో ఎప్పటికీ స్థానం ఉంటుంది.. పార్టీతో పాటు మీ అందరి ఆదరాభిమానాలు పొందుతున్నందుకు ఎంతో గర్వంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రి కొండపల్లి పుట్టిన రోజు వేడుకలు సోమవారం గజపతి నగరంలోని బెల్లాన కన్వెన్షన్‌లో అట్టహాసంగా జరిగాయి. ముందుగా మంత్రి రామతీర్థం, విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం గజపతినగరం చేరుకున్నారు. మంత్రికి పార్టీ కార్యకర్తలు ఎక్స్‌కవేటర్ నుంచి పూల వర్షం కురిపించి తమ అభిమానం చాటుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండపల్లి మాట్లాడుతూ తాత పైడితల్లి నాయుడు పేరు మీద గజపతినగరం హాస్పటల్లో ఉచిత మంచినీటి ఆర్వో ప్లాంట్ ప్రారంభించినందుకు సంతృప్తిగా ఉందన్నారు. పుట్టిన రోజు వేడుకల నేపథ్యంలో ఊరంతా పసుపు మయం చేశారని.. మీ అభిమానం వెలకట్టలేనిది అని.. అయితే ఇంత ఆడంబరాలు వద్దని కార్యకర్తలకు హితవు పలికారు. మీరంతా ఆర్థికంగా ఎదగాలన్నదే తమ అభిమతం అని మంత్రి తెలిపారు. మీరు చూపించిన ప్రేమ, ఆదరాభిమానాలు నా హృదయంలో ఎప్పటకి నిలిచి ఉంటాయని.. మీ ఆశీస్సులే నాకు కొండంత రక్ష అని.. మీరిచ్చిన ఈ ధైర్యంతోనే భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లగలనన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని నియోజకవర్గాన్ని, జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లేలా శాయశక్తులా పనిచేస్తానని మీకు మాట ఇస్తున్నానని కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. కార్యకర్తలు, పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి కట్ చేశారు. ఎమ్మెల్యేలు అతిథి విజయలక్ష్మి, లోకం నాగమాధవి, బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి. యస్.కె.కె.రంగారావు (బేబినాయన), ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మంత్రి పుట్టిన రోజు వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. గజపతినగరం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రతి గ్రామం నుంచి భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న నేతలు, డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు, జిల్లా, నియోజకవర్గంలోని అధికారులు కూడా మంత్రికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.


# స్వీయ గణనపై విస్తృత అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** రాబోయే సెన్సస్-2027 ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానంపై జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రజలే స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే ఈ వినూత్న అవకాశాన్ని ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30, 2026 వరకు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల పౌరులు నిర్ణీత గడువులోగా https://se.census.gov.in అనే పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున 15 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు కార్మికులను భాగస్వాములను చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గ్రామం మరియు వార్డు సచివాలయ సిబ్బంది రోజుకు కనీసం 10 నుండి 20 మందికి ఈ స్వీయ గణనలో చేదోడువాదోడుగా నిలవాలని ఆయన సూచించారు. అదేవిధంగా, సమాజంలోని ప్రముఖ వ్యక్తులు మరియు ప్రజా ప్రతినిధులు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అయితే, ఈ స్వీయ గణన ప్రక్రియ పూర్తిగా స్వచ్ఛందమని, ఎవరిపైనా ఎటువంటి ఒత్తిడి లేదా బలవంతం చేయరాదని ఆయన స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు ప్రణాళికలకు ఆధారమైన ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మంచి మాటలే ఆణిముత్యాలు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** మంచి మాటలు ఆచరణీయమైనవని, మహనీయుల సూక్తులు ఆణిముత్యాలు వంటివని, వాటిని విలువ కట్టలేమని తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన వర్ధమాన రచయిత యడ్ల శ్రీనివాస రావు రాయగా తెలుగు భాషా పరిరక్షణ సమితి ప్రచురించిన మహనీయుల సూక్తులు పుస్తకాన్ని కొత్త అగ్రహారంలో గల గీతాంజలి పాఠశాలలో ఆవిష్కరించి మాట్లాడుతూ వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్లు, నిరంతరం నేర్చుకునే వారే ఇతరులకు జ్ఞానాన్ని అందించగలరని, నువ్వు ధైర్యంగా ఒక అడుగు ముందుకు వేస్తే విజయం పది అడుగులు ముందుకు వస్తుందని రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పిన మంచి మాటలు, పుస్తకాలు లేని ఇల్లు మనసు లేని శరీరం వంటిదని విలియం షేక్స్పియర్ చెప్పిన మాటలు వినడానికి కఠినంగా ఉన్నా నీ గురించి వాస్తవాలు చెప్పే వారి సలహాలు మాత్రమే తీసుకోవాలని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చెప్పిన మాటలు, విలువైన మాటలు చెప్పే వాళ్ళు దొరకడం మన అదృష్టం, అవి విలువైన మాటలు అని తెలుసుకోకపోవడం దురదృష్టమని స్వామి వివేకానంద చెప్పిన మాటలు సైనికునికి తుపాకీ, కవికి భాష ఆయుధాలని గోర్కి చెప్పిన మాటలు విలువ కట్టలేని అపురూపమైన సూక్తులని, అటువంటి గొప్ప సూక్తులతో రూపుదిద్దుకున్న ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ పుస్తకావిష్కరణలో శ్రీ బాలాజీ టెక్స్టైల్ మార్కెట్ పూర్వ అధ్యక్షులు పులిపాటి రామారావు, పుస్తక రచయిత యడ్ల శ్రీనివాసరావు, ప్రముఖ రచయిత కాగుపాటి నారాయణమూర్తి, పాఠశాల కరస్పాండెంట్ ఏ శ్రీనివాసరావు, ప్రముఖ సైకాలజిస్ట్ శంబాన ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ఫేస్ యాప్ రద్దు చేయాలి, రెండు పూటలా పని రద్దు చేయాలి

## - ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల ఆఫీసుల వద్ద ధర్నా



**మక్కువ, (రాజధాని వార్తలు):** ఉపాధి హామీ పథకంలో ఫేస్ యాప్ రద్దు చేయాలని, రెండు పూటలా పని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మక్కువ మండలం ఉపాధి ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వెంకటలక్ష్మికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగు నాయుడు ఉపాధి కూలీలతో కలిసి మెమోరాండం ఇచ్చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిలో ఫేస్ యాప్ రావడం వలన కూలీలకు హాజరు పడక కూలి పొందడం లేదని కొం తమంది కూలీలు మండల ఉపాధి ఆఫీసుకు కూడా వచ్చి తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారని అన్నారు. గిరిజన ప్రాంతంలో సిగ్నల్ లేక గిరిజనులు అనేక ఇబ్బందులకు పడుతున్నారని అన్నారు వెంటనే ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెండు పూటలా పని చేయడం వలన వడదెబ్బకు గురై ఇప్పటికే కూలీలు చావు, బతుకుల మధ్య పనులు చేస్తున్నారని కాబట్టి రెండు పూటలా పని రద్దు చేసి ఒక్క పూట పని ఇవ్వాలని కోరారు. అలాగే వేసవి అలవెన్సు 40% కలిపి కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కొనసాగించి వీబి గ్రామజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఉపాధి సమస్యలైనా టెంట్లు, మెడికల్ కిట్లు, మేట్లకు ప్రోత్సాహం, మంచినీరు, మజ్జిగ, పారా, గుణపం తట్టలకు మెయింటినెన్స్ డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పోరాటానికి కదిలి రావాలని అటువంటి పోరాటాలకు ప్రజా సంఘులు సిద్ధంగా ఉన్నాయని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పిట్టల సీతారాం ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# నూతన తహసిల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపిన వీఆర్వో శంకర్

**రేణిగుంట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం తహసిల్దారుగా జి.శ్యాం ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి డివిషనల్ వీఆర్వో అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.శంకర్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా పదవి బాధ్యతలు స్వీకరించిన తాసిల్దార్‌ను దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ డి టి దిలీప్, మండల సర్వేయర్ కరుణాకర్, శ్రీకాళహస్తి డివిజన్ విఆర్ఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.శంకర్, రేణిగుంట మండలం వీఆర్వో అధ్యక్షులు బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమంత్, కె.సుబ్రహ్మణ్యం, నలిని, రామ్మూర్తి, దిలీప్ విఆర్వో, మరియు వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లాలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామాల మత్స్యకారుల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, అటవీ శాఖ అధికారి సాయిబాబాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్య కారులకు శాశ్వత పరిష్కారంగా నాలుగు గస్తీ బోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో రెండు బోట్లు నెల్లూరు, ఒకటి తిరుపతి, మరొకటి ప్రకాశం జిల్లాలకు కేటాయించగా, మత్స్యకారుల అవసరాలకు అనుగుణంగా 800 హెచ్‌పీ ఇంజన్‌తో త్వరలో అందుబాటులోకి తీసుకు రానున్నట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చే బోట్లను అడ్డుకునేందుకు 24 గంటల గస్తీ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి షిఫ్టుల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. మెరైన్ పోలీసులతో సమన్వయం చేసుకుని లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్, బైనాక్యులర్స్ వంటి భద్రతా పరికరాలను అందజేస్తామని చెప్పారు. మెరైన్ పోలీసులకు రూ.25 లక్షల నిధులు మంజూరు చేసి అవసరమైన పరికరాల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జువ్వలదిన్నె ప్రాంతంలో చిన్న జెట్టీ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదించి త్వరితగతిన చర్యలు చేపడతామని తెలిపారు. అక్రమంగా వచ్చే ఇతర రాష్ట్రాల బోట్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ, పోలీస్, ఫిషరీస్, అటవీ శాఖలు గ్రామస్థులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ మత్స్యకారుల భద్రత కోసం గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి ప్రతినిధులను తీసుకుని ఫిషరీస్ శాఖ, మెరైన్ పోలీసులతో కలిసి సమన్వయ వ్యవస్థగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో 800 హెచ్‌పీ సామర్థ్యం గల స్టీల్ బోట్‌ను 24 గంటల విధానంలో అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్ర రెడ్డి, డీఎస్పీలు, అటవీ శాఖ అధికారులు, మత్స్య శాఖ అధికారి రాజేష్, రమణ, సంబంధిత అధికారులు, మత్స్యకార గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుండి కృషి చేయాలి

## - సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి



**గూడూరు, (రాజధాని వార్తలు):** పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుండి కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేక రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లోకి పార్టీని తీసుకు వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులను కల్పించాలని కోరారు. అదేవిధంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. కార్మిక, కర్షక, పేదల సమస్యల పట్ల నిరంతరం సీపీఐ పోరాడుతుందన్నారు. వందేళ్ళుగా ప్రజా సమస్యల పట్ల నిరంతరం సీపీఐ పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వలన కార్మికులు, కర్షకులు, పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. యుద్ధం సాకుతో గ్యాస్ దొరక్క వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఐతోనే ప్రజా సమస్యల పరిష్కారమన్నారు. మే డేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్.ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్, బి.కె.ఎం.యు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# కునిశెట్టి బలిజ వాణి చెరువు కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

## - ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు




**అచ్యుతాపురం, (రాజధాని వార్తలు):** గ్రామంలో జీవనాడిలాంటి చెరువుల్లోని నీరు కలుషితం కాకుండా కాపాడటం మనందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురం మండలం దుప్పితూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని కునిశెట్టి బలిజవాణి చెరువును అచ్చుతాపురం తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ చెరువు ప్రస్తుతం కలుషితమైందని, వ్యర్థాలు అధికంగా చేరుతున్నాయని తెలిపారు. చెరువులోకి వెళ్లే కలుషిత నీరు, వ్యర్థాలను వెంటనే అరికట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆక్రమణల నుంచి చెరువును రక్షించి, ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, సీనియర్ నాయకులు కర్రి వెంకటరమణ, దేశంశెట్టి కాసుబాబు పాల్గొన్నారు.

# యువతకు విపిఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుంది

## - యువత క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి
## - టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు గ్రామంలో క్రీడా ఉత్సాహం వెల్లివిరిసింది. వి.పి. ఆర్ ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ అర్జున్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెల్లూరు పార్లమెంటరీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ క్రీడా ప్రాంగణాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక నాయకులు మరియు క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. క్రీడా ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు పార్లమెంటరీ స్థాయిలో ఇటువంటి భారీ టోర్నమెంట్ నిర్వహిస్తున్న డాక్టర్ అర్జున్ రెడ్డి యూత్ సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు వారిలోని నైపుణ్యానికి పదును పెట్టేందుకు వి.పి.ఆర్ ఫౌండేషన్ ద్వారా ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని శారీరక దృఢత్వానికి మరియు మానసిక ఉల్లాసానికి ఎంతో తోడ్పడతాయన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి. యువత క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో యువత మరియు క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోండి

## - ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి
## - కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించిన బసినేనిపల్లి రైతులు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా, సీతారామపురం మండలం, బసినేనిపల్లి గ్రామ రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామని కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు సరైన ధర లేకపోవడంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికనందు కలెక్టర్‌కి బసినేనిపల్లి గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బసినేనిపల్లి రైతులు మాట్లాడుతూ గ్రామ పరిధిలో ఉన్న మర్రిఊట్ల వాగు ఆయకట్టు కింద సుమారు 3000 ఎకరాల భూమి సాగులో ఉంది. ఇందులో దాదాపు 400 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. రేయింబవళ్ళు కష్టపడి, అడవి పందుల బెడదను తట్టుకొని, వర్షాభావం, ఖర్చుల భారం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ పంటను పండించామని వారు తెలిపారు. పంటను కోత కోసి, విత్తనాలను ఇంటికి తెచ్చుకున్న తర్వాత ఇప్పుడు అమ్మకాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. "మేము చాలా కష్టపడి మొక్కజొన్న పండించాం. కానీ ఇప్పుడు మా విత్తనాలు కొనేవాళ్లు లేరు. దళారీలు మాత్రం క్వింటాకు రూ.1500 మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. ఈ ధరకు అమ్మితే మాకు తీవ్ర నష్టం వస్తుంది. మా కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతాయి" అని రైతులు వాపోయారు. గత సంవత్సరంలో ప్రభుత్వం క్వింటాకు రూ.2250 చెల్లించి మొక్కజొన్నను కొనుగోలు చేసిన విషయాన్ని రైతులు గుర్తుచేశారు. అయితే ఈ సంవత్సరం మాత్రం మార్కెట్‌లో ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దళారీల ఆధీనంలో ధరలు ఉండడం వల్ల రైతులు తమ పంటను తక్కువ ధరకు అమ్మక తప్పని పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

**రైతుల డిమాండ్లు :**

బసినేనిపల్లి గ్రామంలో తక్షణమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలి. దళారీల దోపిడీని అరికట్టాలి. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. "ప్రభుత్వం వెంటనే స్పందించి మా గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మాకు ఎంతో ఉపశమనం కలుగుతుంది. మా కష్టానికి తగిన ధర రావాలి" అని రైతులు విజ్ఞప్తి చేశారు. కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్న ఈ పరిస్థితిలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. బసినేనిపల్లి రైతుల ఆవేదనకు పరిష్కారం దొరుకుతుందా లేదా అన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది.

ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు అంబ వరపు, రమణారెడ్డి, గుడిపాటి విజయ్, పోకల నారాయణరెడ్డి, అగ్నిగుండాల చిన్న మౌలాలి, మల్లి చిన్నయ్య, కండెల శ్రీరాములు, ఆకుల వెంకటేశ్వర్లు, అమిలిపోగు దాని యేలు, నోవా, బొగ్గవరపు చిన్న గురవయ్య మరియు గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ అడుగు జాడల్లో నడుద్దాం

## - నాడు అంబేద్కర్ వేసిన పునాదే నేటి మహిళా రిజర్వేషన్లకు బిల్లు - 22 నెలల కూటమి పాలనలో దంపూరు గ్రామంలో 86 లక్షలు అభివృద్ధి పనులు
## - బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారతదేశ చరిత్రలో ఏప్రిల్ 14 బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఒక అపురూపమైన రోజని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొనియాడారు. విడవలూరు మండలం దంపూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలనకు మరియు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. సమాజంలో సగభాగమైన మహిళలకు హక్కులు కల్పించడంలో ఆయన చూపిన చొరవను ప్రశంసిస్తూ నాడు ఆయన వేసిన పునాదుల వల్లే నేడు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టగలుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు అంబేద్కర్ గొప్పతనాన్ని చాటిచెప్పేలా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆమె ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. కేవలం 22 నెలల కూటమి ప్రభుత్వ పాలనలోనే దంపూరు గ్రామంలో 86 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా 4 లక్షల రూపాయలతో లో-ఓల్టేజ్ సమస్యను పరిష్కరించడమే కాకుండా, 5 లక్షలతో చౌకిచర్ల చెరువు నుంచి కాలువ పూడికతీత పనులు చేపట్టామన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన త్రాగునీటి కోసం జలజీవన్ మిషన్ ద్వారా 17 లక్షలు, వైద్య సౌకర్యం కోసం 36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మించామని తెలిపారు. అలాగే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి సహకారంతో కలిపి మొత్తం 20 లక్షల రూపాయలతో గ్రామంలో సి.సి. రోడ్లు నిర్మించామని, ఆరుగురు బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా 3.63 లక్షల ఆర్థిక సహాయం అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్కేటింగ్‌లో 'కైట్స్ విద్యా విహార్' విద్యార్థుల సత్తా




**అచ్యుతాపురం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో అచ్యుతాపురంలో వున్న కైట్స్ విద్యా విహార్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ ప్రదర్శించి పలు పతకాలు సాధించారు. స్కేటింగ్ ట్రాక్పై మెరుపు వేగంతో దూసుకెళ్లిన ఈ చిన్నారులు క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో అందరినీ ఆకట్టుకున్నారు. పోటీల్లో తమ ప్రతిభను చాటుతూ ధనుష్ పాండ్య ఇన్లైన్ విభాగంలో సిల్వర్ పతకం సాధించారు. పీ.హర్షవర్ధన్ క్వాడ్ విభాగంలో సిల్వర్ పతకం గెలుచుకున్నారు. అలాగే పీ.జోషప్ క్వాడ్ విభాగంలో సిల్వర్ పతకం అందుకోగా, పీ.జోషిత రజత పతకం సాధించి ప్రతిభ చాటారు. ఈ విజయంతో కైట్స్ విద్యా విహార్ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. విద్యార్థుల విజయంపై పాఠశాల కరస్పాండెంట్ రెడ్డి గణేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రెడ్డి గణేష్ మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించడం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఇలాంటి విజయాలు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కైట్స్ విద్యా విహార్ యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

# కార్పొరేట్ కంపెనీల అభివృద్ధి కోసం పచ్చని ప్రకృతిని నాశనం చేస్తున్న ప్రభుత్వాలు

## - సిఐటియు దేవుడు నాయుడు, సోమినాయుడు



**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** రాంబిల్లి మండలంలోని వెంకయ్యపాలెం, గజ్జిరెడ్డిపాలెం, మన్యపు చింతిన రెవెన్యూ గ్రామాలలో సిపిఎం బృందం పర్యటించి, గూగుల్, రెన్యూ సోలార్ నిర్వాసిత రైతులను, సమస్యలు అడిగి తెలుసుకున్న సిపిఎం పార్టీ రాంబిల్లి మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు, అచ్చుతాపురం నాయకులు, కె.సోమనాయుడు, ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా, పచ్చని ప్రాంతంగా ఉన్న జడ్.చింతవా, మన్యపు చింతవా రెవిన్యూ గ్రామాలలో వేలాది కొబ్బరి చెట్లు, జీడి మామిడి, యూప్లిస్, అకేస్ వంటి చెట్లను, ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం, రెన్యూ సోలార్, అదాని డేటా సెంటర్ల ప్రైవేటు కార్పొరేట్ లాభాల కోసం పచ్చని ప్రాంతాన్ని సర్వ నాశనం చేస్తున్నారని, మాకు ఎటువంటి భరోసా ఇవ్వలేదని, ఒకపక్క సముద్రం, మరో పక్క ఇటువంటి కంపెనీలు వస్తే మేము ఎలా బ్రతకాలని, ఈ మూడు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారని సిపిఎం నాయకులు అన్నారు. మా సాగులో ఉన్న భూములకు, డి.పట్టా భూములకు, కొబ్బరి ఇతర చెట్లకు నష్టపరిహారం చెల్లించకుండా ముఖ్యమంత్రి సభ కోసం, మా నిర్వాసితులకు ఏం చేస్తారో చెప్పకుండా, ఈ కంపెనీలు వస్తే మా నిర్వాసిత గ్రామాలకు ఏమి న్యాయం చేస్తారో తెలపకుండా ఆగమేఘాల మీద బోర్డర్ చుట్టూ ఇనుప కంచెలు వేస్తూ, కంపెనీల పనులు చకచకా నిర్వహిస్తున్నారని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నత స్థాయి అధికారులు, నిర్వాసితుల గోడు వినిపించుకోవాలని, నిర్వాసితులకు చట్టప్రకారం రావలసిన అన్ని పరిహారాలు, సౌకర్యాలు 2013 భూసేకరణ చట్ట ప్రకారం అందించాలని అన్నారు. నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తే, ప్రజలందరినీ సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని సిపిఎం నాయకులు సభాముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ఎరుపిల్లి రాము, మైలపల్లి రమణ, శివాజీ గ్రామస్తులు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ పేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లూబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# బయోఫార్మా రంగంలో నూతన శకం : నూతన ఆవిష్కరణల దిశగా భారత్ అడుగులు : జగత్ ప్రకాష్ నడ్డా



ప్రపంచ ఫార్మాస్యూటికల్ రంగంలో, బయోలాజిక్స్, బయోసిమిలార్స్, స్పెషాలిటీ డ్రగ్స్ ఇప్పుడు ఫార్మాస్యూటికల్ ఆదాయాలలో 40 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయి. జెనరిక్ మందులలో అగ్రస్థానం కారణంగా చాలా కాలంగా 'ప్రపంచ ఫార్మసీ'గా పిలుస్తోన్న భారతదేశ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ, ఇప్పుడు విస్తరణ నుండి ఆవిష్కరణల వైపు తన దృష్టిని మళ్లించడానికి సిద్ధంగా ఉంది. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, భారత ప్రభుత్వం జెనరిక్స్‌లో తన బలాన్ని నిలుపుకుంటూనే, ఈ అభివృద్ధి చెందుతున్న విభాగాలలో దేశం అధిక వాటాను దక్కించుకునేలా ముందుచూపుతో కూడిన విధాన రూపకల్పనని అమలు చేస్తోంది. దీని ద్వారా కొత్తగా ఎదుగుతున్న రంగాల్లో దేశానికి మరింత భాగస్వామ్యం దక్కేలా చూడటమే లక్ష్యంగా పెట్టుకుంది, అదే సమయంలో జనరిక్ రంగంలో ఉన్న బలాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన రూ.10,000 కోట్ల 'మిషన్ బయోఫార్మా మాన్యుఫ్యాక్చరింగ్ శక్తి' ఈ దిశగా ఒక నిర్ణయాత్మక ముందడుగుగా నిలిచింది. రానున్న 8 నుంచి 10 సంవత్సరాలలో బయోఫార్మా ఆవిష్కరణలకు, అధిక విలువ కలిగిన చికిత్సా విధానాలకు ప్రపంచ కేంద్రంగా ఎదగాలన్న భారతదేశ సంకల్పానికి ఇది సంకేతం. లోతైన శాస్త్రీయ సామర్థ్యాలను పెంపొందించడం, ఆవిష్కరణల ఆధారిత సంస్థలను ప్రోత్సహించడం, అలాగే తదుపరి తరం ఔషధాలలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడం వంటి ఈ లక్ష్యాలనే ఆధారంగా చేసుకుని ఈ దిశగా ప్రయాణం కొనసాగుతోంది. ఈ కార్యక్రమం బయోలాజిక్స్, బయోసిమిలర్స్, అధునాతన చికిత్సల రంగాల్లో దేశీయ సామర్థ్యాలను వేగంగా పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఫార్మాస్యూటికల్స్ శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ, బయోటెక్నాలజీ శాఖ చేపట్టిన PRIP (ఫార్మా మెడ్‌టెక్ రంగంలో పరిశోధన, ఆవిష్కరణ ప్రోత్సాహం), రీసెర్చ్ డెవలప్‌మెంట్ & ఇన్నోవేషన్ పథకం, బయోనెస్ట్ వంటి కార్యక్రమాలకు ఇది తోడ్పడుతోంది. జీవ విజ్ఞాన రంగంలో, ముఖ్యంగా బయోఫార్మాస్యూటికల్స్‌లో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడమే వీటి ఉద్దేశ్యం. ఇవన్నీ కలిసి దేశంలో ఆవిష్కరణ వాతావరణాన్ని బలపరచడం, పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, జనరిక్ ఔషధాల నుంచి ఆవిష్కరణ ఆధారిత ఔషధ అన్వేషణ, అభివృద్ధి వైపు మార్పు తీసుకు రావడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ఈ వ్యూహంలో కీలకమైన అంశంగా ఫెర్మెంటేషన్ ఆధారిత తయారీ సామర్థ్యాల అభివృద్ధి నిలుస్తోంది. యాంటీబయాటిక్స్, వ్యాక్సిన్లు, ఎంజైమ్స్, బయోలాజిక్స్ తయారీలో దీనికి ఎంతో ప్రాధాన్యం ఉన్నప్పటికీ, ఈ రంగం చాలా కాలంగా దిగుమతులపై ఆధారపడుతూ వచ్చింది. మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టడం, సాంకేతికత అభివృద్ధి, బదిలీకి సహకారం అందించడం, లక్ష్యిత ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా ఈ కీలక రంగంలో దేశీయ సామర్థ్యాలను పెంచి, ప్రపంచ స్థాయిలో పోటీతత్వాన్ని బలపరచేందుకు భారత్ కృషి చేస్తోంది. అదే స్థాయిలో ప్రాధాన్యం ఉన్న మరో అంశం దేశంలోని క్లినికల్ రీసెర్చ్ వ్యవస్థ విస్తరణ. ఏర్పాటు కానున్న 1,000 గుర్తింపు పొందిన క్లినికల్ ట్రయల్ కేంద్రాలు ప్రపంచ స్థాయి ఔషధ అభివృద్ధి కేంద్రంగా భారత స్థానాన్ని గణనీయంగా పెంచనున్నాయి. తక్కువ ఖర్చు ప్రయోజనం, పెరుగుతున్న నైపుణ్యం కలిగిన పరిశోధకుల వనరు వల్ల సమర్థవంతమైన, నాణ్యమైన క్లినికల్ పరీక్షలకు భారత్ ప్రత్యేక అవకాశాలు అందిస్తోంది. ఇదే సమయంలో నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడం, సంస్థాగత సామర్థ్యాలను పెంచడం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపడే విధంగా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నారు. దీని వల్ల అనుమతులు వేగంగా లభించడం, ప్రపంచ స్థాయి భాగస్వాముల్లో విశ్వాసం పెరగడం సాధ్యమవుతోంది. గత కొన్ని సంవత్సరాల్లో యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్, కీలక ప్రారంభ పదార్థాల స్థానికీకరణలో భారత్ వేగంగా ముందడుగులు వేసింది. దీనికి PLI పథకం, బల్క్ డ్రగ్ పార్క్ పథకాలు ప్రధాన కారణం. ఈ చర్యల వల్ల దేశంలో ఔషధ ధరలు ప్రపంచంలోనే తక్కువ స్థాయిలో నిలిచాయి, ప్రజలకు వైద్యం ఖర్చు అందుబాటులో ఉండేలా సహకరించాయి. ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పర్యోజన ద్వారా తక్కువ ధరల్లో నాణ్యమైన జనరిక్ ఔషధాలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి; 19,000కి పైగా జనౌషధి కేంద్రాలు లక్షలాది మందికి సేవలందిస్తున్నాయి. క్యాన్సర్, అరుదైన వ్యాధుల ఔషధాలపై కస్టమ్స్ సుంకాల సర్దుబాటు వంటి అనుబంధ చర్యలు ప్రాణరక్షక చికిత్సలను మరింత అందుబాటులోకి తెస్తున్నాయి. ఆధునిక చికిత్సలు విస్తరిస్తున్న ఈ సమయంలో అందరికీ సమానంగా చేరేలా చూడటం, ధరలు అందుబాటులో ఉండేలా కాపాడటం విధాన పరంగా ముఖ్య లక్ష్యంగానే కొనసాగుతోంది. పరిశ్రమ రూపాంతరం చెందుతున్న ఈ దశలో స్థిరపడిన మార్కెట్లతో పాటు కొత్తగా ఎదుగుతున్న ప్రాంతాల్లోనూ భారత్ తన ప్రాభవాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది, ముఖ్యంగా ఆవిష్కరణ ఆధారిత రంగాల్లో. ఈ మార్పుకు సంస్కరణలు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. నియంత్రణల సమన్వయం, అనుమతుల ప్రక్రియల డిజిటలైజేషన్, వేగవంతమైన క్లియరెన్సులు వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరుస్తున్నాయి. నాణ్యత ప్రమాణాలు, నియంత్రణ వ్యవస్థ బలోపేతం వల్ల భారత ఔషధాలపై ప్రపంచ స్థాయి విశ్వాసం కొనసాగుతోంది. అయితే పరిశోధన, అభివృద్ధి పెట్టుబడులను పెంచడం ఇంకా సవాలుగానే ఉంది. దీన్ని అధిగమించాలంటే ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం మరింత బలపడాలి. ముందుకు చూస్తే విధాన మద్దతు, సాంకేతిక పురోగతి, మార్కెట్ అవకాశాల సమ్మిళితం ఔషధ రంగానికి అరుదైన వృద్ధి అవకాశాన్ని అందిస్తోంది. ఇప్పటికే 4 లక్షల కోట్లకు పైగా విలువ ఉన్న దేశీయ మార్కెట్ స్థిరంగా విస్తరించనుంది. రాబోయే దశాబ్దంలో జనరిక్ ఔషధాల్లో అగ్రస్థానం కొనసాగించడమే కాకుండా, ఆవిష్కరణ ఔషధాలు, ఫెర్మెంటేషన్ ఆధారిత ఉత్పత్తులు, తదుపరి తరం చికిత్సల్లో శక్తివంతమైన కేంద్రంగా భారత్ ఎదగడానికి మంచి అవకాశాలు ఉన్నాయి. ముగింపుగా, భారత ఔషధ రంగం ఇప్పుడు ఆవిష్కరణ, స్థైర్యం, ప్రపంచ స్థాయి పోటీతత్వం అనే లక్షణాలతో కొత్త దశలోకి ప్రవేశిస్తోంది. బయోఫార్మా శక్తి వంటి కార్యక్రమాలు, విస్తరిస్తున్న క్లినికల్ మౌలిక వసతులు, లక్ష్యిత తయారీ ప్రోత్సాహకాలు ఈ మార్పుకు బలంగా నిలుస్తున్నాయి. పరిమాణంపై ఆధారపడిన జనరిక్ కేంద్రం నుంచి అధిక విలువ గల బయోఫార్మా ఆవిష్కరణలో ముందంజలో ఉండే దేశంగా భారత్ క్రమంగా మారుతోంది. ఈ పరివర్తనం ప్రపంచ ఆరోగ్య రంగంలో భారత పాత్రను బలపరచడంలో కీలకంగా ఉండటంతో పాటు వికసిత భారత్ 2047 లక్ష్యాలకు పునాది వేస్తోంది.

**(రచయిత : కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మరియు రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి)**

# బిహార్ నూతన సీఎంగా సమ్రాట్ చౌదరి

**పట్నా:** బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. కాగా, ఏప్రిల్ 15వ తేదీన బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan